మేడారం అభివృద్ధి పనులు

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- డిసెంబర్ 20లోగా పనులు పూర్తి చేయాలి
- నాణ్యతలో రాజీపడేది లేదు : మంత్రి పొంగులేటి
- 'మేడారం' అభివృద్ధి పనులపై రాజకీయాలొద్దు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంకు చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొండ సురేఖ, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రులు, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కెఎస్ శ్రీనివాసరాజు, సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం హరిత కాకతీయ హోటల్‌లో అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై కూలంకషంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రాకారం లోపల, సివిల్ పనులు, గద్దెల ఎత్తు పెంచడం, నిర్మాణం, ప్రధాన ద్వారాలు, ఆర్చ్, 4 వాచ్ టవర్లు, ప్రాకారానికి చుట్టూ సీసీ రోడ్డు పనులు సమాంతరంగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. మెన్ మెటీరియల్ పెంచి 24 గంటలు పనులు జరగాలని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు, డివైడర్లు, ప్లాంటేషన్ నెల రోజుల్లో పూర్తి కావాలన్నారు. మల్లంపల్లి బ్రిడ్జి, కటాక్షపూర్ బ్రిడ్జి పనులు డిసెంబర్ 15లోగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో క్యూ లైన్ షెడ్స్, నాలుగు రోడ్డు లైన్ల విస్తరణ, టెంపర్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీని 3 వేల నుంచి 10 వేలకు పెంచనున్నారు. 19 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జంపన్నవాగుపై చెక్ డ్యామ్‌ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. శాశ్వత బస్‌స్టేషన్, పర్యాటక శాఖ ద్వారా జంపన్నవాగు అభివృద్ధి, సుందరీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వివరించారు.

'మేడారం' అభివృద్ధి పనులపై రాజకీయాలొద్దు : మంత్రి సీతక్క

అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడు జరగని విధంగా మేడారం జాతరలో ముందస్తుగానే ప్రభుత్వం అభివద్ధి పనులు చేపట్టిందని, వాస్తవాలు తెలుసుకోకుండా అభివృద్ధి పనులపై రాజకీయాలు చేయొద్దని తెలిపారు. కొన్ని పత్రికలు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అవాస్తవాలు రాయడం సరికాదని అన్నారు. గిరిజనుల సంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గిరిజనుల అస్తిత్వం, ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మరో వారం రోజుల్లో గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని అన్నారు. పనుల్లో ఎలాంటి నిధుల దుర్వినియోగం కాకుండా పనులు చేపట్టినా కొందరు రాజకీయం చేయడం సరికాదన్నారు. జంపన్న వాగులో రూ.10 కోట్లతో చెక్‌డ్యాములు కట్టి రెండు సంవత్సరాలకే కోటి రూపాయల ఖర్చుతో తొలగించారని, ఎవరు నిధులు దుర్వినియోగం చేస్తున్నారో ప్రజల గమనిస్తున్నారని అన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. వచ్చే 200 సంవత్సరాల పాటు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తుందని, చరిత్రలో నిలిచిపోయే విధంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం జాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. మేడారంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి అనుకున్న సమయంలోగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హరీశ్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శబరిష్, డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్, జి సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చెర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఆర్‌అండ్‌బి, పిఆర్ ఇఎన్‌సి, ఆర్‌డిఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, పూజారులు, అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమ పథకాలు మన హక్కు

- కలిసికట్టుగా పోరాడితేనే చేనేత మనుగడ సాధ్యం
- 20న నిర్వహించే చేనేత మహాధర్నాను జయప్రదం చేయాలి : చెరుపల్లి, శాంతికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాల కోసం కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలని, అది మన హక్కు అని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెరుపల్లి సీతారాములు, అధ్యక్షులు వనం శాంతికుమార్ అన్నారు. విభిన్న మతాలకు, కులాలకు అతీతంగా రాజోలి చేనేత కేంద్రంగా ఉందని చెప్పారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు దోత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత రుణమాఫీ మహార్యాలీని ప్రారంభించారు. రాజోలి చేనేత సహకార సంఘం నుంచి ప్రధాన వీధుల గుండా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన చేపట్టారు. తహసీల్దార్ రామ్మోహన్‌కు చేనేత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాలకు నూలు మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకన్యకా పరమేశ్వర ఆలయం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. విభిన్న మతాలు, కులాలకు అతీతంగా రాజోలి చేనేత కేంద్రంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పట్టు చీరలకు చాలా ప్రాముఖ్యత ఉందని, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప చేనేత కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20న నిర్వహించే మహాధర్నాలో అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొనాలని కోరారు. శాంతికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చేయడం లేదని అన్నారు. ఉపాధి లేక.. అప్పుల పాలైన చేనేత కార్మికులకు రూ.63 కోట్ల రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వీటన్నింటిపై ఈ నెల 20న హైదరాబాద్‌లోని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాధర్నాకు రాజోలి చేనేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని, పోరాడితేనే తమ హక్కులు సాధించుకోగలమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరహరి, రాజోలి చేనేత సహకార సంఘం అధ్యక్షులు డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దస్తగిరి, సిపిఎం నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులను పరిష్కరించండి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి విన్నవించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రితో వారు భేటీ అయ్యారు. కొనుగోలు సెంటర్ల వద్ద రైతులకు పక్కా రసీదులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడ్తున్న తీరును వివరించారు.

ఇక తూకం వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపి అక్కడ దింపే వరకు రైతులను బాధ్యులుగా చేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై రైతు కమిషన్‌కు చాలా ప్రాంతాల నుంచి రైతులు ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు ఫోన్ చేసి ఇలాంటివి మరోసారి జరగకుండా చూసుకోవాల ని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణకు చర్యలు : ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం అయిన మెడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారేజ్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు బ్యారేజీల ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పనులు చేపట్టేందకు సన్నాహాలు జరుపుతున్నామన్నారు. మెడిగడ్డ కుంగి పోవడానికి, సుందిళ్ళ అన్నారం బ్యారేజ్‌ల లీకేజ్‌లకు గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, సాంకేతిక లోపాలే కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, న్యాయ కమిషన్‌లు పేర్కొన్నాయని తెలిపారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌పై కుడా ఆరోపణలు వచ్చిన నేపద్యంలో అర్హత కలిగిన స్వతంత్ర సాంకేతిక సంస్థలను నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర జలవనరుల సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త డిజైన్లను రూపొందించాలని నిపుణులను అదేశించామన్నారు. ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఐఐటి అనుబంధ కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు.

సివిల్స్ మెయిన్స్‌లో సత్తా చాటిన తెలంగాణ

- రాష్ట్రం నుంచి 33 మంది ఇంటర్వ్యూకు ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిపిఎస్‌సి 2025 మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో తెలంగాణ సత్తా చాటింది. రాష్ట్రం నుంచి 33 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు యూపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ బుధవారం వెల్లడించింది. ఆగస్టు 22 నుంచి 31 వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో మొత్తం 2,736 మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొంది. అర్హత సాధించిన అభ్యర్థులను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్, ఇండియన్ పోలీస్ సర్వీస్, ఇతర కేంద్ర సర్వీసులకు (గ్రూప్ ఏ, గ్రూప్ బీ) ఎంపిక కోసం పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కి పిలుస్తారు. అందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటించనుంది. ఫలితాలను యుపిపిఎస్‌సి తన అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. అయితే తెలంగాణ నుంచి ఇంటర్వ్యూకి సెలక్ట్ అయిన వారంతా రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సాయం పొందినవారే కావడం గమనార్హం.

మెయిన్ విజేతలకు సిఎం అభినందనలు

రాష్ట్రం నుంచి సివిల్స్ ఇంటర్వ్యూకు 43 మంది ఎంపిక కావడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. తుది దశ ఇంటర్వ్యూలో సత్తా చాటి తెలంగాణ ఖ్యాతిని దేశ వ్యాప్తం చేయాలని ఆకాక్షించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సింగరేణి సహకారంతో సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ వరకు మూడు దశల్లో రూ.లక్ష చొప్పున అందిస్తున్నామని చెప్పారు. అర్హత సాధించిన 43 మందికి మరో రూ.లక్ష త్వరలో అందిస్తామని ప్రకటించారు.

శాఖల ప్రధాన కార్యాలయాల్లో మంత్రి తుమ్మల తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన పరిధిలోని వివిధ శాఖల ప్రధాన కార్యాలయాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సమయపాలన పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హకా, సీడ్ సర్టిఫికేషన్ కార్పొరేషన్, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్‌టైల్స్ ప్రధాన కార్యాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సమయానికి హాజరుకాని కొంతమంది అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పౌరుగుసేవల సిబ్బంది సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ఉద్యోగులైన జనరల్ మేనేజర్లు, మేనేజర్ల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సమయపాలనను కఠినంగా అమలు చేయాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి..

- ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నా పరిహారం ఏదీ..?
- కేసులతో బాధితుల లూటీ
- ఎకరాకు రూ.10-రూ.20 లక్షల డిమాండ్
- రెవెన్యూ అధికారుల అండదండలు
- ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల్లో తీవ్ర ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ మామునూరు విమానాశ్రయం భూ నిర్వాసితులకు జిల్లా ఉన్నతాధికారులు నష్టపరిహారం విషయంలో ముందు చెప్పిన పద్ధతి ప్రకారం కాకుండా భిన్నంగా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం 'నవతెలంగాణ' వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాలను సందర్శించింది. ఈ సందర్భంగా విమానాశ్రయం భూ నిర్వాసితులను కలుసుకొని నష్టపరిహారం విషయంలో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న కొర్రీలు, సమస్యలను అడిగి తెలుసుకుంది. దళారులు రంగప్రవేశం చేసి 1963, 1969 పహానీల ఆధారంగా కాగితాలు సృష్టించి ఎంజాయ్‌మెంట్‌లో ఉన్న రైతులకు నష్టపరిహారం రాకుండా అడ్డుకుంటున్నారని తెలిసింది. ఈ విషయంలో వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారులు సైతం దళారులకు ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత ఎంజాయ్‌మెంట్ సర్వేలో కాస్తు కబ్జాలో ఉన్న వాళ్లకే నష్టపరిహారం ఇస్తామన్న అధికారులు, ఇప్పుడు పట్టాదారుల ఆమోదం ఉంటేనే చెల్లిస్తామనడంతో పట్టాదారులు పలువురు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొంత మంది పట్టాదారులు ఎక్కడున్నారో కూడా తమకు తెలీదని నిర్వాసితులు వాపోతున్నారు. కలెక్టర్‌తోపాటు పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్ నాగరాజు.. తొలుత ఇచ్చిన హామీకి భిన్నంగా నష్టపరిహారంలో కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ మామునూరు విమానాశ్రయం భూసేకరణ విషయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ భూమి ఎంజాయ్‌మెంట్‌లో ఉన్న రైతులందరికీ నష్టపరిహారం ఇస్తామని చెప్పారని గుంటూరుపల్లికి చెందిన భూ నిర్వాసితుడు శాఖమూరి నరహరి మీడియాకు తెలిపారు. ఇప్పుడు తమపై ఫిర్యాదు చేశారని, వారు వచ్చి సంతకం పెడితే మీకు నష్టపరిహారం ఇస్తామంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 150 ఎకరాలకు సంబంధించిన నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 70 ఎకరాలకు సంబంధించి పలు వివాదాలు తెరపైకి వచ్చాయి. ఇందులో 50 ఎకరాలకు సాదాబైనామాల వివాదాలున్నాయి. ఈ గ్రామం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాగం కావడంతో సాదాబైనామాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ధరణిలో నమోదు చేసుకునే అవకాశం లేకుండాపోయింది. 20 ఎకరాలకు సంబంధించి పట్టాదారుల వివాదాలున్నాయి. మరో పదేకరాలకు సంబంధించి పలు కేసులు వేయడంతో పెండింగ్‌లో పడ్డాయి. భూ నిర్వాసితులు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఆర్‌డిఓ తదితర అధికారులను తప్పుపడుతున్నారు.

రెవెన్యూ 'కొర్రీ'లతో నిర్వాసితులు పరేషాన్..

మామునూరు విమానాశ్రయానికి 280.30 ఎకరాల భూసేకరణలో భాగంగా భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చేందుకు తొలుత రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. తాజాగా మరో రూ.90 కోట్లను విడుదలయ్యాయి. వ్యవసాయ భూమి ఎకరాకు రూ.1.20 కోట్ల నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభు త్వం నిర్ణయించింది. 'నాలా' ఉన్న వారికి ఒక గజం రూ.5,500 నష్టపరిహారం ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. తాజాగా ఈ విషయాల్లో రెవెన్యూ అధికారులు కొర్రీలు పెడుతుండటం గమనార్హం. 'నాలా' ఉన్నా వ్యవసాయ భూమిగానే పరిగణించి నష్టపరిహారం ఇస్తామని చెబుతుండటంతో నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది నిర్వాసితులకు ఇప్పటికే నష్టపరిహారం వారి ఖాతాల్లో పడటంతో రెవెన్యూ అధికారులు ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. వ్యవసాయం చేసుకునేటోళ్లం ప్రతిరోజూ కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరగలేమని అంటున్నారు.

దళారుల దందా..

ఇదే సమయంలో భూనిర్వాసితుల నష్టపరిహారం కాజేయడానికి కొందరు దళారులు రంగప్రవేశం చేశారు. 1963, 1968 నాటి పహానీల ఆధారంగా కాగితాలను సృష్టించి నిర్వాసితులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరికి మద్దతుగా ఇదే గ్రామానికి చెందిన ఒక దళారి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయినట్టు తెలిసింది. దశాబ్దాల క్రితమే తాము కొనుగోలు చేసుకొన్న రైతులు వ్యవసాయ చేస్తున్నా, తెలంగాణ పాసు పుస్తకాలు, ధరణిలో చూపెడుతున్నా, రైతుబంధు డబ్బులు పడుతున్నా ఇప్పుడు ఈ నష్టపరిహారం ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు మోకాలడ్డుతుండటం పట్ల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరుపల్లికి చెందిన శాఖమూరి నరహరితోపాటు 19 మంది 1998లో 5.18 ఎకరాలు కొనుగోలు చేశారు. ధరణిలో ఈ భూమిని చూపెడుతుంది. రైతుబంధు నిధులను రాష్ట్ర ప్రభుత్వం వీరి ఖాతాలో జమ చేసింది. వీరికి చెందిన సర్వేనెంబర్ 244లో 1968లో పహానీ ఆధారంగా దొంగ కాగితాలు సృష్టించి ఆ భూమి తమదని, నష్టపరిహారం తమకే ఇవ్వాలని పలువురు వ్యక్తులు ఒక దళారి అండదండలతో రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. దాంతో నరహరితోపాటు పలువురు నిర్వాసితులకు నష్టపరిహారాన్ని నిలిపివేశారు. వీరంతా కలెక్టర్‌ను సంప్రదిస్తే వారు సంతకాలు చేస్తే మీకు నష్టపరిహారం ఇస్తామని చెబుతుండటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముందు చెప్పిందొకటి.. ఇప్పుడు చేస్తుందొకటి : శాఖమూరి నరహరి, భూ నిర్వాసితుడు, గుంటూరుపల్లి

కాస్తు కబ్జాలో ఉన్న వాళ్లకే నష్టపరిహారం ఇస్తామని ముందు చెప్పిన అధికారులు ఇప్పుడు ప్లేటు ఫిరాయించారు. దళారులు రంగంలోకి దిగి 1960నాటి పహానీల ఆధారంగా దొంగ కాగితాలు సృష్టించి మాకు నష్టపరిహారం రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు దళారులకే మద్దతు పలుకుతున్నరు. మంత్రి, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని మాకు వెంటనే నష్టపరిహారం ఇప్పించాలి.

పసుపు, కుంకుమ కింద ఇచ్చి ఇప్పుడు కేసు : కొంగర భాస్కర్, గుంటూరుపల్లి

మా మేనమామ పసుపు, కుంకుమ కింద 1992లో 2.20 ఎకరాలు నాకివ్వడంతో ఆయన కూతురిని పెండ్లి చేసుకున్నా. అప్పటి నుంచి ఈ భూమి కాస్తు, కబ్జాలో నేనే ఉన్నా. ఇందులో 30 గుంటల భూమి మామునూరు విమానాశ్రయం కింద పోయింది. పట్టాదారు కాలమ్‌లో మా మేనమామ పేరే ఉంది. దాంతో మా మేనమామే ఇప్పుడు నష్టపరిహారం తనకు రావాలని నాపై కేసు పెట్టిండంట. ఈ విషయం సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఆర్‌డీవోను కలిసినప్పుడు తెలిసింది. ఈ నష్టపరిహారం వస్తే బిడ్డ పెండ్లి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నా.. ఇప్పుడు ఈ కేసుతో పెండ్లి విషయం ఇబ్బందయితాంది.. భూ భారతి చట్టంలో భూనిర్వాసితుల విషయంలో ముందు అధికారుల వద్దే భూ వివాదాలను పరిష్కరించుకోవాలన్న నిబంధన ఉంది. ఈ నిబంధనలను రెవెన్యూ అధికారులే పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌ను మా గ్రామంలో గ్రామసభ పెట్టి కాస్తు, కబ్జాలో ఎవరున్నారో, ఎన్నేండ్ల నుంచి ఉన్నారో నిర్ధారణ చేసుకొని వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని చెప్పాం.

దక్షిణ మధ్య రైల్వేతో ఐఐటి ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్)కు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) హైదరాబాద్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ పివి మురళీ కృష్ణ, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సమక్షంలో తేజ్ ప్రకాష్ అగర్వాల్, విజయ్ సెర్వాల్, ప్రొఫెసర్ జి నరహరి శాస్త్రి సంతకాలు చేశారు.

ఫ్లెక్సీల తొలగింపుపై రగడ

- మంత్రి వెంకటరెడ్డిపై కవిత ఫైర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు వివాదానికి దారితీసింది. జాగృతి జనం బాట రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో వివిధ కార్యక్రమాలు చేపట్టింది. జాగృతి నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కవిత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన నల్లగొండలో ఉన్నందున కవిత ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై నల్లగొండ పర్యటనలో ఉన్న కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెద్ద మినిస్టర్ అనుకున్న.. మా వాళ్ల ఉత్సాహంతో ఫ్లెక్సీలు పెడితే ఇంత ఓర్వలేని తనమా.. మీ ప్రభుత్వం చేస్తున్న తప్పులను మీ దృష్టికి తీసుకురావడం తప్పంటే ఎలా..? మా ప్రశ్నలకు సమాధానాలు లేకనే ఫ్లెక్సీలు తీయించారు.. ఇది రాజకీయాల్లో మీ స్థాయిని తగ్గించుకోవడమే.. మీతో నాకు ఎలాంటి పంచాయితీ లేదు' అని అన్నారు. అని ప్రశ్నించారు.

నోటీసు

మహారాజశ్రీ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఏ. నెం: 427/2025 ఇన్ ఓ.ఎస్. నెం: 6/2019

తొమ్మండ్రు చంద్రశేఖర్ ...పిటీషనర్/వాది

వర్సెస్

తొమ్మండ్రు మహాలక్ష్మి మరియు 11 మంది ...రెస్పాండెంట్స్

టు,
చాటకొండ కళ్యాణి, భర్త: చాటకొండ రవిశంకర్, లోధ అపార్ట్‌మెంట్, సనత్‌నగర్ బస్టాండు దగ్గర, సనత్‌నగర్, హైదరాబాద్ టౌన్ మరియు జిల్లా, తెలంగాణ రాష్ట్రం, (3వ రెస్పాండెంట్స్)

పై నెంబరు దావాలోని షెడ్యూల్ ఆస్తిలో భాగ పంపిణీ నిమిత్తం పిటీషనరు/వాది దావా దాఖలు చేయగా సదరు దావా డిస్మిస్ ఫర్ డిఫాల్ట్ అయినందున, కేసు రెస్టోరేషన్ చేయమని కోరుతూ పిటీషనరు/వాది పై కోర్టులో, పై నెంబరు పిటీషన్ దాఖలు చేసినందున, మీకు పలుమార్లు నోటీసులు పంపగా, అవి మీకు ముట్టని కారణం చేత ఈ దినపత్రిక నోటీసు ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 26-11-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా గానీ లేక అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 26-11-2025, సయ్యద్ అలీ జహీర్, పిటీషనరు అడ్వకేట్, మార్కాపురం ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

SUMMON [V/O V RULE 1&5] IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE, PRODDATUR, KADAPA DISTRICT, STATE OF A.P.

O.S.No. 82/2023

Palla Venkatrami Reddy, S/o Obula Reddy, 54 years, Hindu, Business, D.No.4/753, Muddanur Road, Back Side of state bank of India, Yerra guntla Town and Mandal, Kadapa District. ...Plaintiff

Vs

Akkiraju Siva Prasad, S/o Sivarma Raju @ Sree Rama Raju died his L.Rs Defendant No.1 to 3

To,
D1. Akkiraju Jhansi, W/o Late Siva Prasad, 48 years, Hindu, Business
D2. Akkiraju Akhil, S/o Late Siva Prasad, 27 years, Hindu, Business.
D3. Akkiraju Akash, S/o Late Siva Prasad, 23 years, Hindu, Software Engineer.
All are residing at Flot No.G-1301, Aparna Serana Park, Sy.No.146, SBI Officers Quarters, Masjid Banda, Gachibowli, Kondapur, Serlingam Pally, Hyderabad-500084. ...Defendants No.1 to 3

Whereas above plaintiff has instituted suit against all of you for recovery of amount of Rs. 31,95,480/-. All of you i.e. above named defendants are hereby summoned to appear in this court in person of by a pleader on 4/12/2025 at 10:30 A.M. to answar the same, Failing which the suit will be disposed of exparte.

Adjournment date: 4/12/2025

//By Order of the Court//

MARTHALA SUDHAKAR REDDY
Advocate for Plaintiff, PRODDATUR.

IN THE COURT OF THE 8TH ADDL. DISTRICT AND SESSIONS JUDGE CUM SPECIAL JUDGE FOR TRIAL OF OFFENCE AGAINST WOMEN: RAJAMAHENDRAVARAM

I.A.NO.440 of 2023
O.S.No.33 of 2021

Between:
Marella Sai Sirisha ...*Petitioner/ Plaintiff*

AND

Iduri Venkata Ramakrishna Mohan Rao and others ...*Respondents/ Defendants*

Respondent Nos. 2, 6 & 7

R-2: Iduri Paparao, S/o Venkata Ramakrishna Mohanarao, Hindu, aged 69 years, retired employee, Plot No.75, Golden palms, Ameenpur, Patancheruvu, Medak District-502032, Telangana State.

R-6: Smt. Varigonda Subbalakshmi, W/o Srirama Murthy, Hindu, aged 63 years, House-wife, D.No.31-5-10/1/7, Road No.7, TMR Maruthi Habitat, Sathavahana Nagar, Kurmannapalem, Visakhapatnam- 530046.

R-7: Smt. Kaligotla Dhanalakshmi, W/o Gangarao, Hindu, aged 61 years, Employee, resident of coconut grove, Lotus-401 block, Mayuri Nagar, Miyapur, Hyderabad-500049, Telangana State.

Whereas the above named petitioner filed the above I.A.No.440 of 2023 in O.S.No.33 of 2021 to set aside the dismissal order dt.13-02-2023 and restore the suit. The case stands posted to **03-12-2025** for appearance of respondent Nos. 2, 6, and 7 **at 10.30 A.M.** before the said court. Take notice that if you fail to appear before the said court on that day, the matter will be proceeded ex-parte in your absence.

S.KUMAR, ADVOCATE
#78-10-10, Syamala Nagar
RAJAHMUNDRY, Cell:9949570440

DECCAN POLYPACKS LIMITED
Regd. Office & Works : Plot No. A-40, Road No. 7, IDA Kukatpally, Hyderabad-37, Telangana.

KEY FINANCIAL HIGHLIGHTS OF STANDALONE UNAUDITED FINANCIAL RESULTS

(Rs. in Lakhs except earning per share data)

S. No.	Particulars	Quarter Ended			Year Ended	
		30.09.2025	30.06.2025	30.09.2024	31.03.2025	31.03.2024
1.	Total Income from Operations	-	-	-	111.97	2.14
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	-2.52	-29.08	-0.73	90.52	-4.58
3.	Net Proft / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	-2.52	-29.08	-0.73	90.52	-4.58
4.	Net Profit / (Loss) for the period after Tax (after exceptional/ or Extraordinary items)	-2.52	-29.08	-0.73	90.52	-4.58
5.	Total comprehensive income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive income (after tax)]	-2.52	-29.08	-0.73	90.52	-4.58
6.	Equity Share Capital	211.50	211.50	211.50	211.50	211.50
7.	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year	-	-	-	-	-
8.	Earnings per Share (of Rs. 10/- each) (for continuing and discontinued operations) 1. Basic	-0.12	-1.37	-0.03	4.28	-0.22
	2. Diluted	-0.12	-1.37	-0.03	4.28	-0.22

Notes:
1. The above is an extract of the detailed format of Unaudited Standalone Financial Results of the Company for the quarter ended 30th September, 2025, filed with stock Exchange under Regulation 33 of the SEBI (Listing and other Disclosure Requirements) Regulations, 2015
2. These above results were reviewed by the Audit Committee and were thereafter approved by the Board of Directors at their meeting held on 12-11-2025.
3. As the Company has suspended it's manufacturing operations and has sold of its land, buildings and manufacturing facilities and in the absence of final action plan / affairs and operations of the Company, the Financial Statements of the Company have not been prepared on a going concern basis. These Financial Statements/results have been prepared on a realisable value basis.
4. The previous financial period figures have been re-grouped/re-arranged/re-stated wherever considered necessary.

For **Deccan Polypacks Limited**

Sd/-
DRSP RAJU
WHOLE TIME DIRECTOR
DIN : 00306612

Place: Hyderabad
Date: 12.11.2025

అమర జ్యోతి కేంద్రాన్ని ప్రారంభించండి

● సిఎంకు చిన్నారెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరవీరుల స్మారక కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన అమర వీరుల స్మారక కేంద్రాన్ని సందర్శించారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అమరులైన తొలి, మలి దశ ఉద్యమకారుల స్మారకం కోసం నిర్మించిన అమర జ్యోతి కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గంటా జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

“ఆసరా” బకాయిలు తక్షణమే చెల్లించాలి

● డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

“ఆసరా” పెన్షన్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు బుర్ర రాము గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆసరా పెన్షన్ రూ.2వేల నుంచి రూ.4వేలకు, వికలాంగులకు రూ.4వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామన్న హామీని అమలు చేయాలని కోరారు. ఆసరా పెన్షన్ దారుల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ లాభాల్లో 27 శాతం వృద్ధి

హైదరాబాద్ : వీసా, పాస్‌పోర్ట్ ఔట్‌సోర్సింగ్ కంపెనీ బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను సాధించినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 27.4 శాతం వృద్ధితో రూ.185.7 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. కంపెనీ రెవెన్యూ 48.8 శాతం వృద్ధితో రూ.736 కోట్లుగా నమోదయ్యిందని తెలిపింది. ఈ ఫలితాలు తమ అంతర్జాతీయ విస్తరణ, పోర్టుఫోలియో పెంపునకు దోహదం చేస్తాయని ఆ కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శిఖార్ అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

● ఈనెల 26న దేశవ్యాప్త ప్రదర్శనలు
● 'కేంద్ర ప్రభుత్వ విధానాలు - వ్యవసాయ రంగంలో సంక్షోభం'పై సదస్సులో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్
● ఎనిమిది రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి : సాగర్
● సామినేని, సంక్రాంతి కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో “కేంద్ర ప్రభుత్వ విధానాలు - వ్యవసాయ రంగంలో సంక్షోభం” అనే అంశంపై సదస్సు నిర్వహించారు. చింతనిప్పు చలపతిరావు అధ్యక్షత జరిగిన ఈ రైతు సదస్సులో విజ్జు కృష్ణన్ మాట్లాడారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం వల్ల సాగుకు రైతులు దూరం అవుతున్న పరిస్థితి నెలకొన్నది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షులు ట్రంప్ బెదిరింపులకు లొంగిపోయి పత్తిని దిగుమతి సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడం వల్ల మన దేశ రైతులకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. దాంతో మద్దతు ధర క్వింటాకు రూ.8110 కూడా పొందకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. మూడు నల్లచట్టాల ఉద్యమం సమయంలో ఆనాడు కేంద్రం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న దేశవ్యాప్త ప్రదర్శనలకు పిలుపునిచ్చామని, వాటిని జయప్రదం చేయాలని అన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని, ఎనిమిది రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి నేడు కేవలం సన్న ధాన్యంకు మాత్రమే బోనస్ ఇస్తుందని, అది కూడా రబీ సీజన్లో రైతులకు జమ చేయలేదని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2025 విద్యుత్ సంస్కరణల బిల్లుతో విద్యుత్ వ్యవస్థ ప్రయివేటీకరణ వైపు అడుగులు వేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు.

సంక్రాంతి మధుసూదనరావు కుటుంబానికి పరామర్శ

సదస్సు అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదనరావు కుటుంబాన్ని విజ్జు కృష్ణన్, తీగల సాగర్‌తో కలిసి పరామర్శించారు. సంక్రాంతి మధుసూదన్ రావు చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. మధుసూదన్ రావు భార్య సంక్రాంతి సామ్రాజ్యం, కుమారుడు రవికుమార్‌కు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాంతం శ్రమజీవులు, బుడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.

రాజకీయ కక్షతోనే సామినేని హత్య

సామినేని రామారావు హత్య దారుణమైన ఘటన అని, రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ గూండాలు అత్యంత కిరాతకంగా హత్య చేశారని ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సామినేని రామారావు ఇటీవల హత్యకు గురికాగా ఆయన కుటుంబ సభ్యులను బుధవారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్‌తో కలిసి విజ్జు కృష్ణన్ పరామర్శించారు. సామినేని రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామినేని రామారావు భార్య స్వరాజ్యం, కుమారుడు విజయకుమార్‌ను పరామర్శించి ఓదార్చారు. సంఘటన జరిగిన తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. తన భర్తను కాంగ్రెస్ గూండాలు రాజకీయంగా ఎదుర్కోలేకనే అత్యంత కిరాతకంగా హత్య చేశారని స్వరాజ్యం వివరించారు. ఆనాటి సంఘటన జరిగిన తీరును ఆయనకు సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, కుమారుడు విజయకుమార్ వివరించారు. అనంతరం విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ.. సామినేని రామారావు మృదు స్వభావి అని, రైతు సమస్యలపై సంపూర్ణమైన అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. రైతు సమస్యలపై తాను రామారావుతో కలిసి 2009 పనిచేశానని తెలిపారు. రామారావు జనప్రియ నేత అని, ఆ భయంతోనే కాంగ్రెస్ గూండాలు రామారావుని హత్య చేశారని అన్నారు. వర్గ శత్రువులపై పోరాటం చేయటమే మనం రామారావుకి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.కె మీరా, వాసిరెడ్డి ప్రసాద్, రాయల వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, రైతు మహిళ కో కన్వీనర్ బొంతు సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము, పార్టీ బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొండ్రు జానకి రామయ్య, వత్సవాయి జానకి రాములు, మునికుంట్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

కృష్ణా నీళ్లు తేవడంలో అలసత్వం

● సిఎం ఇంటి ముందు ధర్నా చేస్తాం
● జిల్లాకు సాగు నీరందించడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ విఫలం : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది నీళ్లు తేవడంలో అలసత్వం ప్రదర్శిస్తే సీఎం ఇంటి ముందు నిర్వాసితులతో కలిసి ధర్నా చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె నల్లగొండ పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ తెచ్చుకున్నామన్నారు. గత పదేండ్లలో చాలా విజయాలు సాధించాం.. కానీ ఇంకా సాధించాల్సింది చాలా ఉందని అన్నారు. మన నీళ్లు మనకు వస్తాయని అందరం అనుకున్నాం.. కానీ నల్లగొండ జిల్లాకు కృష్ణా నీళ్లు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో ఆలోచించారన్నారు. మాధవరెడ్డి ప్రాజెక్ట్, మూసీ, డిండి, ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టులతో జిల్లాకు నీళ్లు రావాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ద్వారా కొంత నీళ్లు రావాలని, అయినా కృష్ణా నీటిపైనే ఎక్కువగా జిల్లావాసులు ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ నల్లగొండ జిల్లాకు సాగు నీరందించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వాలను అడిగేందుకు, నిలదీసేందుకే జాగృతి జనంబాట చేపట్టిందన్నారు.

కిష్టరాయినిపల్లె, నెల్లికల్ ప్రాంతాల్లో భూసేకరణ చేసి 17 ఏళ్లవుతున్నా నిర్వాసితులకు భూమి లేదు, ఉద్యోగం లేని పరిస్థితి ఉందన్నారు. సుంకిశాల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌ను తిట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఎపిడ్యూరల్ మెడిసిన్‌ను ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉంచాలని కోరారు. “మంత్రి వెంకట్‌రెడ్డికి నాతో ఏం పంచాయితీ ఉంది? మా పిల్లల్ని (జాగృతి కార్యకర్తలు) ఎందుకు అరెస్టు చేయించావు? జాగృతితో పెట్టుకున్నోళ్లు ఎవరూ బాగుపడు.. ఇప్పుడు నేను రాజకీయాలు చేయడానికి రాలేదు. రాజకీయాలు చేసినప్పుడు మీకు గట్టి పోటీదారులను పెడతాం” అని అన్నారు. జిల్లాలో 13 లక్షల 44 వేలమెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశారని, మిర్యాలగూడ రైస్‌మిల్లుల హబ్ కావడంతో సగం ధాన్యం వాళ్లే కొనే పరిస్థితి ఉందని అన్నారు. మిగిలినవి ఆరు లక్షల మెట్రిక్ టన్నులేనని, వాటిని ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇస్మాయిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ కృషి అభినందనీయం

● నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ములంగూర్ జడ్‌పి హెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న మొరె మనోహర్ పాఠశాల విద్య సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇ నవీన్ నికోలస్ ప్రశంసలందుతున్నారు. మనోహర్ రూపొందించిన ఎడ్యుకేషనల్ ఆవేర్నెస్ ప్లాట్ గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న మనోహర్ ను టీచర్ శ్రీనివాసరావు దేశ్‌ముఖ్ ప్రోత్సాహంతో ఎఐ సహాయంతో దీనిని రూపొందించారు.

డిఇటితో హెచ్‌సిసిబి ఒప్పందం

హైదరాబాద్ : ఐటిఐ విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అవకాశాలను అందించడానికి హిందూస్తాన్ కోకా కోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటిఐ) కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఆచరణాత్మక సాంకేతిక శిక్షణ, పరిశ్రమ అనుభవాన్ని అందించడానికి తెలంగాణ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (డిఇటి)తో ఒక అవగాహన ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌లోని డిఈటి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డిఇటి జాయింట్ డైరెక్టర్ ఎస్‌వికె నగేష్, హెచ్‌సిసిబి క్లస్టర్ హెచ్‌ఆర్‌హెడ్ బి తిరుపతి రావు సంతకాలు చేసి అవగాహన ఒప్పందం మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది. పరిశ్రమ విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి డిఒటి, హెచ్‌సిసిబి మధ్య నిరంతర అనుసంధానతను సులభతరం చేస్తుంది.

ఎస్ఐబిఎం ఎంబిఎకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : సింబయోసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐబిఎం) పూణే వంటి ప్రముఖ క్యాంపస్‌లలో ఎంబిఎ ప్రోగ్రాం పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి 2025 నవంబర్ 20 చివరి తేదీగా నిర్ణయించినట్లు ఆ విద్యా సంస్థ పేర్కొంది. దరఖాస్తు దాఖలు చేసేందుకు ఇక ఎలాంటి పొడిగింపు ఉండదని యూనివర్శిటీ ప్రకటించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష మూడు తేదీలలో నిర్వహించబడుతుందని పేర్కొంది. అభ్యర్థులు మూడు సార్లు వరకు పరీక్షకు ప్రయత్నించవచ్చని.. ఉత్తమ స్కోర్‌ను అడ్మిషన్ ప్రక్రియకు పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొంది. పరీక్ష ఫలితాలను జనవరి 26న వెల్లడించనున్నట్లు తెలిపింది.

నోరు అదుపులో పెట్టుకోకుంటే ప్రజలు బుద్ధి చెబుతారు

● మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోకుంటే ప్రజలు తగినరీతిలో బుద్ధి చెబుతారని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికలకు సంబంధించి బిఆర్ఎస్ నాయకులు రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందనీ, ప్రజాస్వామ్యం గురించి వారు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ చేసినట్టు తాము చేస్తే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు జైళ్లో ఉండేవారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజల తీర్పు తమకు అనుకూలంగా లేదని తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు తమపై దుమ్మెత్తి పోస్తున్నారని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగాయాయన్నారు.

మహిళా కబడ్డీ వరల్డ్ కప్ రెఫరీగా శ్రీను నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండవ ఉమెన్స్ కబడ్డీ వరల్డ్ కప్ ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీసర్ (రెఫరీ)గా హైదరాబాద్ జిల్లా చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి శ్రీను నాయక్ ఎంపికయ్యారు. బంగ్లాదేశ్ ఢాకాలో నవంబర్ 17 నుంచి 24 వరకు వరల్డ్ కప్ పోటీలు జరగనున్నాయి. కబడ్డీ ఈవెంట్‌కు ప్రభుత్వ పాఠశాల నుంచి ఎంపికైన తొలి ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీను నాయక్. ఈ సందర్భంగా పాఠశాల విద్య సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇ నవీన్ నికోలస్ శ్రీను నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీను నాయక్‌కు అవకాశం రావడం ఆయనకు వ్యక్తిగతంగానే కాకుండా విద్యాశాఖకే గర్వకారణమని అభివర్ణించారు.

శ్రీరామ్ లైఫ్ వ్యాపారంలో 17 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో తమ రిటైల్ నూతన వ్యాపార ప్రీమియం వసూళ్లు 17 శాతం పెరిగి రూ.635 కోట్లుగా నమోదయ్యిందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ఎల్ఐసి) వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.542 కోట్ల ప్రీమియం నమోదయ్యిందని పేర్కొంది. గడిచిన హెచ్1లో వ్యక్తిగత నూతన బీమా వ్యాపార ప్రీమియం ఎనిమిది శాతం పెరిగి రూ.542 కోట్లుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో 37,850 వ్యక్తిగత, గ్రూప్ పాలసీలను సెటిల్ చేసినట్లు తెలిపింది. ఈ పరిష్కార నిష్పత్తి 98.31 శాతంగా ఉందని ఆ సంస్థ ఎండి, సిఇఒ జెహెచ్ క్రోమ్‌హౌట్ పేర్కొన్నారు.

ఎక్స్‌పీరియన్ కొత్తగా గ్రామీణ స్కోర్ ఆవిష్కరణ

హైదరాబాద్ : క్రెడిట్ బ్యూరోలలో ఒకటైన ఎక్స్‌పీరియన్ కొత్తగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వ్యాపారాలకు సులభంగా రుణాలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇటీవల 'ఎక్స్‌పీరియన్ గ్రామీణ్ స్కోర్' ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు, స్వయం సహాయక బృందాలు సులభంగా, బాధ్యతాయుతంగా అధికారిక రుణాలను పొందడంలో సహాయపడనున్నట్లు పేర్కొంది. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలో చాలా మందికి ఆర్థిక క్రెడిట్ చరిత్ర పరిమితంగా ఉంటుంది లేదా ఉండదు. ఈ స్కోర్ వల్ల వారికి ఆర్థిక పరపతి, తీరును ఖచ్చితంగా అంచనా వేయడానికి రుణదాతలకు సహాయపడుతుందని ఎక్స్‌పీరియన్ ఛైర్మన్ మనీష్ జైన్ తెలిపారు.

టాటా ఇవి ఛార్జింగ్ స్టేషన్ల విస్తరణ

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో భారీగా మెగా ఛార్జింగ్ స్టేషన్లను ప్రారంభించినట్లు విద్యుత్ కార్ల తయారీదారు టాటా ఇవి వెల్లడించింది. వోల్ట్రాన్‌తో ఒప్పందం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒకేసారి 14 మెగాఛార్జర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. వోల్ట్రాన్‌తో భాగస్వామ్యం ద్వారా అందుబాటులోకి తెచ్చిన ఇవి పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లలో ఇవి కార్లను సులభంగా ఛార్జింగ్ చేసుకోవచ్చని తెలిపింది. వీటితో దేశవ్యాప్తంగా 70కి పైగా ఛార్జింగ్ స్టేషన్లకు విస్తరించినట్లయ్యిందని పేర్కొంది.

పురపాలన 'కంపు'

● అస్తవ్యస్తంగా మున్సిపాలిటీల తీరు
● స్వయంగా సిఎం నిర్వహిస్తున్న శాఖ పనులు అధోగతి
● మేయర్లు - చైర్మన్లు, కమిషనర్ల మధ్య గ్యాప్
● లంచాలకు పెద్దపీట.. అర్హత లేనివారికి అందలం
● టౌన్ ప్లానింగ్ విభాగం అక్రమ అనుమతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న పురపాలకశాఖ తీరు అస్తవ్యస్తంగా మారింది. సరైన నియంత్రణ లేకపోవటంతో అవినీతి కంపు కొడుతోంది. రికమండేషన్ లేఖలతో అధికారులకు బాధ్యతలు అప్పగిస్తుండటంతో పాలన కుంటుబడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దాదాపు రెండేళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఇప్పటికీ నలుగురు కమిషనర్లను మార్చటం కుదురుకోని పాలనకు నిదర్శనం. కీలక విభాగాల్లోని అధికారుల వరుస బదిలీలు మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయనే చర్చ నడుస్తోంది. ఇక కొత్త మున్సిపాల్టీల్లో కనీస సౌకర్యాలూ కరువయ్యాయి. చాలా చోట్ల మున్సిపల్ కమిషనర్ల పాలనా తీరు విమర్శలకు దారితీస్తున్నాయి.

కొత్త మున్సిపాల్టీలు మరింత అస్తవ్యస్తం

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని గ్రామపంచాయతీలను ఏకం చేసి మున్సిపాల్టీలుగా మార్చుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో ఏకైక మున్సిపాల్టీగా ఏదులాపురాన్ని ఏర్పాటు చేశారు. 12 పంచాయతీలను మిళితం చేసి దీన్ని పెద్దతండా గ్రామపంచాయతీ ఆఫీస్ కేంద్రంగా నెలకొల్పారు. ఇలా రాష్ట్రంలో అనేక పంచాయతీలను గత బిఆర్ఎస్ పాలనప్పటి నుంచి మొదలు నేటి వరకూ పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. కానీ దానికి తగిన అధికారులు, కమిషనర్లు, సిబ్బందిని నియమించటంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

అర్హతలేని కమిషనర్లతో ఆగమాగం

రాష్ట్రంలో కొత్త మున్సిపాల్టీలకు అర్హత, అనుభవం లేని కమిషనర్లను నియమిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వారు ఏమి పనిచేస్తున్నారో అర్థంకాని దుస్థితి నెలకొంది. మున్సిపాల్టీలు సెలక్షన్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3గా ఉంటాయి. గ్రేడ్‌ల ఆధారంగా అర్హతున్న అధికారులు, కమిషనర్లను నియమించాలి. కానీ రాష్ట్రంలో చాలా చోట్ల గ్రేడ్-1 మున్సిపాల్టీల్లో గ్రేడ్-3 ఆఫీసర్లు కమిషనర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులుగా సచివాలయంలో పనిచేసి వచ్చిన వారిని కమిషనర్లుగా నియమిస్తున్నారు. మున్సిపాల్టీలపై పూర్తి అవగాహన లేని ఎఎస్ఒ, ఎస్ఒలను సైతం మూడు గ్రేడ్‌ల మున్సిపల్ కమిషనర్లుగా విధులు అప్పగిస్తున్నారు. ఇలా సరైన అర్హత లేని వారిని కమిషనర్లుగా నియమిస్తుండటంతో పాలన ఆగమాగంగా కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం, కొన్ని కొత్తమున్సిపాల్టీలకు కౌన్సిలర్లు, చైర్మన్ పాలకవర్గం లేకపోవటంతో కమిషనర్లే ప్రతి పనినీ పర్యవేక్షించాల్సి వస్తుంది. ఒక్కో మున్సిపాల్టీలో 30కి పైగా వార్డులు ఉండటంతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కానిపిస్తోంది.

అవినీతి 'రోత'

పారిశుద్ధ్యం, పాలనా విభాగాల్లో అనేక లోపాలున్నా సరిచేయాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. దీనికి ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం కూడా తోడవటంతో మున్సిపాల్టీల్లో అవినీతి 'రోత' పుట్టిస్తోంది. అనేక చోట్ల డబ్బే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫైల్‌కో రేటు నిర్ణయించి మున్సిపల్ జనరల్ ఫండ్‌కు తూట్లు పొడుస్తున్నారు. కిందిస్థాయి వ్యవస్థను చక్కబెట్టాల్సిన వారే సంబంధిత సిబ్బందితో కలిసి బేరసారాలు చేస్తున్నారు. కొంతమంది కమిషనర్లు, అధికారులు ఏ చిన్న అవకాశం దొరికినా వదలకుండా నకిలీ ఫైల్స్ తయారు చేసి డబ్బులు గుంజుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు మున్సిపాల్టీల్లో ఖాళీ జాగాలకు సైతం ఇంటినంబర్లు ఇస్తుండటం టౌన్‌ప్లానింగ్ విభాగంలోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తోంది. ఖమ్మం మధిర మున్సిపాల్టీలో ఎలాంటి ఆధారంగా లేకుండా ఓ వ్యక్తికి ఇంటి నెంబర్ ఇచ్చిన అధికారులు.. అదే ఖాళీ స్థలానికి వాస్తవ యజమానికి, మరొకరికి బిల్డింగ్ పర్మిషన్ ఇవ్వటం హైకోర్టు వరకూ వెళ్లింది. ప్రస్తుత కమిషనర్ సంపత్‌కుమార్ గత కమిషనర్ హయాంలో జరిగిన తప్పిందంగా చూపి తప్పుకుంటుండగా.. నాడు మధిర మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న అంబటి రమాదేవి ప్రస్తుతం కోదాడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాను మధిర నుంచి బదిలీ అయ్యాను కాబట్టి ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదన్నట్టుగా ఆమె వ్యవహారం ఉంది. ఖమ్మం కార్పొరేషన్‌లో స్వచ్ఛ వాహనాల విషయంలోనూ అనేక ఆరోపణలు ఉన్నాయి. ఏ మున్సిపాల్టీలోనైనా టౌన్ ప్లానింగ్ విభాగం సరిగ్గా పనిచేస్తున్న దాఖలాలు లేవు. రెవెన్యూ విభాగంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఫండ్ డైవర్షన్ చేసి మరీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ఉదంతాలూ ఉన్నాయి. రాష్ట్ర పురపాలక శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఒకరి తర్వాత ఒకరు ఏసీబీకి పట్టుబడుతున్నా వారి ధన దాహార్తి తీరటం లేదు. దీనంతటికీ పై స్థాయిలో ఉదాసీనతే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తున్నా వాటిని అత్యధిక మంది పాటించడం లేదు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

మున్సిపాల్టీల్లో పారిశుధ్య వ్యవస్థ తీరు మరింత అధ్వాన్నంగా ఉంటోంది. నూతన మున్సిపాల్టీల్లో ఇది మరింత దారుణంగా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సంబంధిత పనులకు వెచ్చిస్తున్నారా? లేదా? అనే దానిపైనా పర్యవేక్షణ లేదు. ఇటీవల ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన వెబ్ ఎక్స్ మీటింగ్‌లో చెప్పిన సమాధానాలు సైతం పై అధికారికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయంటే కిందిస్థాయి అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రూ.లక్షలు ముట్టజెప్పి పోస్టింగులు

రూ.లక్షలు ముట్టజెప్పి అధికారులు పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారన్న చర్చ అయితే ఉంది. కొందరు అక్రమ పద్ధతిలో డిప్యూటేషన్లు సైతం పొందుతున్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాల్టీల్లో కమిషనర్లుగా పనిచేస్తున్న పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలకు రూ.లక్షల్లో ముట్టజెప్పి అర్హత లేకున్నా కమిషనర్లుగా విధులు నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రోడ్లు, పార్కులు, ప్రభుత్వం స్థలాలను కబ్జాల భారీ నుంచి రక్షించేందుకు సిఎం హైడ్రాను ఏర్పాటుచేసినా కొంతమంది కమిషనర్లు పట్టించుకోవడం లేదు. జనం ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా వచ్చి రోడ్లు, పార్కుల కబ్జాలను కాపడుతుంటే శివారు మున్సిపాల్టీల్లో ఉన్న కమిషనర్లు దానికి ప్రతిబంధకంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. సిఎం నిర్వహిస్తున్న శాఖలో ఇంత బాహాటంగా నిబంధనలు ఉల్లంఘిస్తుంటే చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక కొందరు అధికారులు ఏండ్ల తరబడి ఒకేచోట తిష్టవేసి విధులు నిర్వహిస్తున్నారు. ఇదీ అవినీతికి తావిస్తోంది. మధిర మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్ అధికారి ఒకరు దాదాపు ఆరేండ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక రియల్టర్లు, బిల్డర్లతో తనకున్న పరిచయాలను ఉపయోగించుకొని ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారు. ఆర్ఐ సైతం ఇదే దందా సాగిస్తున్నారు. రాష్ట్రంలోని అనేక మున్సిపాల్టీల్లో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది ఇలాగే అక్రమాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఖమ్మం వంటి చోట కమిషనర్ అభిషేక్ అగస్త్యకు మేయర్ పునుకొల్లు నీరజకు పొసగట్లేదనే టాక్ ఉంది. కమిషనర్‌కు తెలియకుండా మేయర్ తనకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిహెచ్ఎంసికి రెండేళ్లలో నలుగురు కమిషనర్లు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో జిహెచ్ఎంసి కమిషనర్లను నలుగుర్ని మార్చింది. రోనాల్డ్‌రోస్ బాధ్యతలు తీసుకున్న మూడునెలలకే మారారు. ఆయన స్థానంలో హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఆ తర్వాత కొద్దిరోజులకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. క్యాట్ ఆదేశాలతో ఆమె ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లటంతో నాలుగు నెలల్లో ఆమె స్థానాన్ని ఇలంబర్తితో భర్తీ చేసింది. కమిషనర్‌గా ఇలంబర్తి కుదురుకునే లోపే ఏడు నెలల్లో ఆయన్ను మార్చి ఆర్వీ కర్ణన్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. జీహెచ్ఎంసీ పరిధిలోనే కాదు ఆయా మున్సిపాల్టీల్లోనూ గుట్టుచప్పుడు కాకుండా అధికారుల బదిలీలు సాగుతున్నాయి. సీడీఎంఏ కార్యాలయంలో తిష్టవేసిన ఇద్దరు అధికారులు అవినీతికి అలవాటుపడి ఇష్టానుసారంగా బదిలీలు చేయిస్తున్నా కీలక పురపాలకశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి వీటిని పట్టించుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది.

“జువెల్స్ ఆఫ్ అసఫ్ జాహీస్‌ది గ్లోరీ ఆఫ్ వరంగల్ ” పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

“జువెల్స్ ఆఫ్ అసఫ్ జాహీస్-ది గ్లోరీ ఆఫ్ వరంగల్ ” పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరంలో అసఫ్ జాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు, వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే కన్నెగంటి వెంకటరమణ చారిత్రక అంశాలతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్‌ను వెలువరించడం అభినందనీయమని సిఎస్ ప్రశంసించారు. వరంగల్ అంటే... కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. అయితే, వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే కాజిపేట నుంచి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజిపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్‌గా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని కొన్ని ప్రాంతాలు ఉండేవి. ఈ వరంగల్ సుబేదారులుగా ఎవరెవరు ఉన్నారు.

విద్యాశాఖ కార్యదర్శిగా శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాశాఖ కార్యదర్శిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా సెలవులో వెళ్లడంతో ఆమె స్థానంలో కళాశాల, సాంకేతిక కమిషనర్ ఎ.శ్రీదేవసేనకు విద్యాశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా శ్రీదేవసేన వ్యక్తిగత పనులపై విదేశాలకు సెలవుల్లో వెళ్తుండటంతో ఆ స్థానంలో శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీదేవసేన సెలవుల కాలంలో కళాశాల, సాంకేతిక కమిషనర్‌గా, స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు.